వైద్యులు శ్రీవాత్సవ్‌కు అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫైనల్ పరీక్షలో 800 మార్కులకు 607 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఆర్థోపెడిక్స్‌లో అత్యధిక స్కోర్ తో, స్టేట్ 1 వ ర్యాంక్ సాధించి, థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించినందుకు డాక్టర్ జి.శ్రీవాత్సవ్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందతో పాటు పలువురు అభినందించారు.మంగళవారం కెజిహెచ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అభినందనలు తెలిపారు. శ్రీవాత్సవ్ కెజిహెచ్ ఆర్థోపెడిక్స్ విభాగం అధిపతి., డాక్టర్ పి. శివానంద మార్గదర్శకత్వంలో 1వ యూనిట్‌లో శిక్షణ పొందారు.ఈ సందర్భంగా డాక్టర్ శివానంద మాట్లాడుతూ, శ్రీవాత్సవ్‌కు ఆర్థోపెడిక్స్‌లో రాణించాలనే అంకితభావం, పట్టుదల, అభిరుచికి ఈ అత్యుత్తమ విజయం నిదర్శనం అన్నారు.ఆయన కెరీర్ లో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.లోకనాథ్, ప్రొఫెసర్ డాక్టర్ ఎంసి హెచ్ నాయుడు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పట్టభద్రుల పట్టం రాజశేఖరంకే


టిడిపి నేతలతో కలిసి పేరాబత్తుల రాజశేఖరం విజయ దరహాసం

- తొలి ప్రాధాన్యతా ఓటుతోనే విజయం
- దాదాపు 30 గంటలు సాగిన ఓట్ల లెక్కింపు
- పిడిఎఫ్ అభ్యర్థిపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు
- మొత్తం ఓట్లలో తేడా, చెల్లని ఓట్లు 19,789
- ఫలించిన టిడిపి, కూటమి శ్రేణుల శ్రమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘువులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణ మొదలైంది. 13న విత్‌డ్రాల పర్వంతో నామినేషన్ల ప్రక్రియ ముగియగా 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ జరగ్గా మొత్తం 3,14,984 ఓట్లకుగాను 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని బ్యాలెట్ బాక్సులను ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దాదాపు 12 గంటలపాటు ఓట్లు కట్టలు కట్టడమే సరిపోయింది. దాదాపు 16 గంటలకు రాత్రి 11.45 గంటలకు తొలి రౌండ్ ఫలితాలు వెల్లడించారు. 28 టేబుళ్ల ఏర్పాటు చేసి టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున ఎనిమిది రౌండ్లుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది. ప్రతి రౌండ్ ఫలితం దాదాపు రెండు నుంచి మూడు గంటల వరకూ పట్టింది. దాదాపు 30 గంటల తర్వాత నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. తొలి ప్రాధాన్యతా ఓటును లెక్కిస్తూ, చెల్లని ఓట్లను పక్కన పెడుతూ కౌంటింగ్ ప్రక్రియ సాగింది.

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న రాజశేఖరం

ఓట్ల లెక్కింపులో సిబ్బంది


రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వితో టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖరం, దిడ్ల వీర రాఘువులు మాటామంతీ

తొలి ప్రాధాన్యతా ఓట్లతోనే టిడిపి అభ్యర్థి గెలుపు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,18,997 ఓట్లు పోలైనట్లు అధికారులు తేల్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా 19,789 ఓట్లు చెల్లనివి తేలాయి. చెల్లుబాటు ఓట్లు 1,99,208గా తేల్చారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపు సాధించాలంటే 99,604 ఓట్లు రావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొత్తం 1,24,702 ఓట్లు వచ్చాయి. ప్రతి రౌండ్‌లోనూ 15 వేలకు పైగా ఓట్లు సాధిస్తూ టిడిపి అభ్యర్థి పైచేయి సాధిస్తూ ముందుకెళ్లారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ జరగ్గా ఏడో రౌండ్‌లోనే టిడిపి అభ్యర్థి గెలుపునకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో మొత్తం 47,241 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జివి.సుందర్‌కు 16,183 ఓట్లు వచ్చాయి. విజయం సాధించిన టిడిపి అభ్యర్థికి జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ధ్రువీకరణపత్రం అందించారు. ఎన్నికల్లో గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖరానికి సమీప ప్రత్యర్థి దిడ్ల వీర రాఘువులు అభినందనలు తెలిపారు.

కౌంటింగ్ ఆలస్యంపై సర్వత్రా అసహనం

ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ వేగంగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. పక్కన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితం మూడో తేదీ రాత్రికే స్పష్టత రాగా, ఇక్కడ మాత్రం నాలుగోతేదీ మధ్యాహ్నం రెండుగంటల వరకూ సాగింది. సరైన ప్రణాళిక లేకుండా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారనే చర్చ సర్వత్రా సాగింది. సిబ్బంది మూడు షిఫ్టులుగా లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహనలో అధికారులు విఫలం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు వేసే అంకెలపై అధికారులకు, ఏజెంట్లకు మధ్య మూడో తేదీ రాత్రి వాగ్వివాదం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అభ్యర్థి పేరు ముందు బాక్సులో ఒకటి మాత్రమే వేయాలని, రోమన్ అంకెలు వేయకూడదని, అలా వేస్తే చెల్లదని చెబుతూ వచ్చారు. కానీ కౌంటింగ్ ప్రక్రియలో మాత్రం రోమన్ అంకె ఒకటి వేసినా చెల్లుబాటు అవుతుందని తేల్చారు. అదేవిధంగా ఒకటి అంకె తప్ప గడిలో మరేమీ వేయకూడదని ప్రచారంలో అభ్యర్థులు సైతం ఓటర్లకు తెలిపారు. ఒకటికి ముందు జీరో వేసినా ఓటు చెల్లుబాటు అవుతుందని కౌంటింగ్‌లో అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఒకటి వేసి ఒకటి చుట్టూ సున్నా చుట్టినా ఓట్లు చెల్లుబాటు అవుతాయని చెప్పడంపై పలువురు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు అభ్యర్థులతో జరిగిన సమావేశాల్లో ఓటింగ్ ప్రక్రియపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే ఇది జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల నిబంధనావళి బుక్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడం విశేషం.

ప్రధాన అభ్యర్థులు	వచ్చిన ఓట్లు
పేరాబత్తుల రాజశేఖరం	1,24,702
దిడ్ల వీరరాఘువులు	47,241
జివి.సుందర్	16,183
చెల్లని ఓట్లు	19,789

ఓట్లలో తేడా.. చెల్లని ఓట్లు 19,789

ఫిబ్రవరి 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరిగింది. అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం మొత్తం 2,18,902 ఓట్లు పోలవగా 69.50 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోస్టల్ ఓట్లు 243 కలుపుకుంటే మొత్తం 2,19,145గా ఉండాలి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక అధికారులు ఇచ్చిన లెక్కలు చూస్తే మొత్తం ఓట్లు 2,18,997గా పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఇచ్చిన లెక్కలకు, కౌంటింగ్ పూర్తయ్యాక ఇచ్చిన లెక్కలకు 148 ఓట్లు తగ్గాయి. దీనికి సంబంధించి అధికారులు ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతో గతంలో ఇచ్చిన లెక్కలు, ప్రస్తుతం ఇచ్చిన లెక్కలపై అంతటా అయోమయం నెలకొంది. పట్టభద్రులు ఎన్నికల్లో సైతం చెల్లని ఓట్లు భారీగా నమోదవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏకంగా 19,789 ఓట్లు చెల్లనివిగా తేలాయి. ఎక్కువ మంది అంకెలు వేయకుండా టిక్కులు పెట్టడం వల్ల చెల్లని ఓట్లుగా మిగిలిపోయాయి. పోస్టల్ ఓట్లు 243 పోలవగా, అందులో చెల్లని ఓట్లు 42గా ఉన్నాయి. చదువుకున్న వారుసైతం ఓటు సరిగా వేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

గెలుపోటములకు కారణాలపై చర్చ

ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి గెలుపునకు ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయి. ముందుగా అభ్యర్థిని ప్రకటించడం కలిసొచ్చింది. అంతేకాకుండా ఓటర్ల చేర్పులో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, గ్రామస్థాయి నాయకులు వరకూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించడం. 30 మంది ఓటర్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేయడం, సోషల్ మీడియా, టెక్నాలజీని బాగా వినియోగించుకోవడం, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచడం. ఆర్థిక బలం ఇలా అనేక అంశాలు టిడిపి అభ్యర్థి గెలుపునకు ప్రధాన కారణమయ్యాయి.

కూటమిపై నమ్మకమే గెలుపునకు కారణం
పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ గెలుపునకు కారణం. ఎన్నికల రోజు లోకేష్ నిరంతరం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపించారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి గెలుపునకు లోకేష్ ఎనలేని కృషి చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం ఆనందంగా ఉంది. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు
దిడ్ల వీరరాఘువులు, పిడిఎఫ్ అభ్యర్థి

ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ ఘట్టం నుంచి చివరి వరకూ నాకు మద్దతు తెలిపి ఓటేసిన పట్టభద్రులకు, నా ప్రచారంలో పాల్గొని సహకరించిన శ్రేణులకు అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళల, యువత పక్షాన పోరాటం కొనసాగుతోంది.

మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయండి

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి -పాడేరు: మ్యుటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సదస్సులలో స్వీరించిన ఫిర్యాదులు, భూ సమస్యలు పరిష్కారం, రైతుల రిజిస్ట్రేషన్, భూ సర్వే, మ్యుటేషన్లపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వేకు సహకరించని సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లకు సూచించారు. తహశీల్దారులు కార్యాలయాలకు హాజరు కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దారులు రైతు సదస్సులో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రైతుల రిజిస్ట్రేషన్ నిర్దిష్టమైన సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, చింతూరు పి.ఓ అపూర్వ భరత్, డి ఆర్ ఓ కె.పద్మలత, సర్వే సహాయ సంచాలకులు దేవేంద్రుడు, తహశీల్దారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా లో జరుగుతున్న అన్ని రకాల సర్వేలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం వీసి సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒలు, 22 మండలాల ఎంపిడిఒలతో వర్చ్యువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఏంఎస్ఎంఇ, మిస్సింగ్ సిటిజన్స్, ఆదార్ నమోదు లేని పిల్లలు, జనన మరణాల ఆలస్య నమోదు, స్కూల్ టాయిలెట్ తనిఖీ, వర్క్ ఫ్రమ్ హెూం , పి 4 , తదితర సర్వేలు వేగంగా పూర్తి చేయాలని ఎం పి డి ఒ లను ఆదేశించారు. జిల్లాలో ఏంఎస్ఎంఇ సర్వేలో 70 శాతం సర్వే పూర్తి అయిందని ఇంకా 30 శాతం త్వరితగతిన పూర్తి చేయాలనీ సూచించారు. వర్క్ ఫ్రమ్ హెూం సర్వే లో భాగంగా సర్వే చేసే విధానాన్ని వివరించారు. వారం లోగా సర్వే పూర్తిచేయాలని హెచ్చరించారు. జిల్లాలో ఆదార్ నమోదు లేని పిల్లలు 68వేలు ఉండగా 35 శాతం పూర్తియినందున సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. లేట్ బర్త్, డెత్ నమోదుల్లో సర్వేలో వెనకబడి ఉన్నామని తెలిపారు. పంచాయతి సెక్రెటరి, డిజిటల్ అసిస్టెంట్, క్షేత్ర స్థాయి సిబ్బందికి వీక్లీ టార్గెట్స్ పెట్టి వేగవంతం చేయాలని సూచించారు. ఎం పి డిఒలు వారం లో కనీసం నాలుగు సచివాలయాలు సందర్శించాలని ఆదేశించారు. స్కూల్ టాయిలెట్ తనిఖీ లో భాగంగా ప్రతి వారం లో రెండు సార్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు తనిఖీ చేసి ఫొటోస్ యాప్ లో అప్లోడ్ చేయాలనీ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 సర్వే ను జిల్లా లో ఈనెల8 నుండి పద్దెనిమిది వరకు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి మార్చ్ 27 లోగా తుది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఐటిడిఎ పిఒ లు, ఎంపిడిఒలు, గ్రామ సచివాలయ నోడల్ అధికారి పి ఎస్ కుమార్, సిపిఒఎస్ ఎస్ ఆర్ కె పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

నాటు కోటి మాంసం పచ్చడి తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన మహిళాసాధికారిత, వారి ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు నవజీవన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె.సహదేవయ్య అన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో హైపర్ ఇంటర్ నేషనల్ వారి సహకారంతో మహిళలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నాటు కోడి పచ్చడి తయారీపై మహిళలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సహదేవయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతాలలో నాటు కోళ్ళ పెంపకానికి మహిళా రైతులను ఎంపిక చేసి నాటుకోళ్ళను ఇవ్వటం జరిగిందని తెలిపారు. దీని ద్వారా మహిళలు ఇంటివద్దనే సంపాదన మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇంకా అధిక ఆదాయం పొందే విధంగా నాటుకోళ్ళ పచ్చడి తయారీ శిక్షణను ఇచ్చి, వాటికి మార్కెట్‌లో అమ్ముకునే విధంగా చైతన్యం పర్చడం జరుగుతుందని చెప్పారు. ఉత్సాహం వున్న మహిళలను కేప్స్‌గా ఎంపిక చేసి నాటుకోళ్ళకు వ్యాక్సిన్ వేయడం కోసం వారికి అనేకమార్లు శిక్షణ ఇచ్చామని, అది వారికి ఆదాయ వనరుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కేప్స్ ఎంటర్ ప్రైజర్ షిప్‌లో భాగంగా ఒకొక్క కేప్‌కి రూ.5వేలు ఆర్గనైజేషన్ ద్వారా ఇచ్చినట్లు చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఇ) ఏర్పాటు చేసుకోవటం కోసం కిరాణా షాప్‌లకు, జెరాక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్ షాప్‌ల కొరకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. గిరిజన మహిళలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. మహిళల పౌష్టికాహారాన్ని దృష్టిలో పెట్టుకుని వారి పెరటి ప్రాంతంలో వివిధ రకాల ఆకు కూరలు, కాయగూరలు పెంచుకొనే విధంగా వారికి కిచెన్ గార్డెన్ విత్తనాల కిట్‌లను ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం

ప్రజాశక్తి-రంపచోడవరం

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియెల్ ఆధ్వర్యంలో డివిజన్ ఆఫీస్ పరిధిలో మంగళవారం లైన్‌మెన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు కొనుతూరి కృష్ణ, జె.దేవేందర్, యమ్‌డి.రాజ్వాన్, ఎస్.కన్నపురాజుదొరలను సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ అందించడం, ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వచ్చినప్పుడు విద్యుత్ పునరుద్ధరించడంలో లైన్ స్టాఫ్ చేసిన సేవలను అభినందించారు. పనిచేసే సమయంలో భద్రతా ప్రమాణాలు చాలా ముఖ్యమని, కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, డివిజన్ ఆఫీస్ సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌కు అవార్డు అందిస్తున్న దృశ్యం

ఎల్ఐ గణేష్‌కు ఉత్తమ సేవా అవార్డు

చింతూరు : విద్యుత్ సేవలందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చింతూరు లైన్ ఇన్‌స్పెక్టర్ కణితి గణేష్‌కు ఢిల్లీలో హై పర్ఫార్మింగ్ అవార్డు దక్కింది. ఈ అవార్డు ఎపిఇపిడిసిఎల్ విశాఖ సర్కిల్‌లోని చింతూరుకు చెందిన గణేష్‌కు దక్కడంపై విద్యుత్ ఉన్నతాధికారులు, సబ్ స్టేషన్ ఏడి, ఏఈ, సబ్ ఇంజనీర్, ఇతర అధికారులు హర్షం వ్యక్తం చేశారు. లైన్ మెన్ దివస్ సందర్భంగా గణేష్‌ను సత్కరించారు.

రెండు ఎకరాల జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన రైతు సరిమూర్తి సూరిబాబుకు సంబంధించిన సుమారు రెండు ఎకరాల జీడి మామిడి తోట మంగళవారం దగ్ధమైంది. పంట చేతికి అంది వచ్చే దశలో జీడి మమిడి తోట కాలి బూడిదవడంతో తమ కుటుంబ పరిస్థితి ఎలా అని సూరిబాబు ఆవేదన చెందుతున్నారు. ఎలాగైనా తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

కాలిపోయిన జీడి తోటను పరిశీలిస్తున్న రైతు సూరిబాబు

సంతలో ఉన్న మద్యం సీసాలు

మందుబాబులకు అడ్డాగా వారపు సంత షెడ్లు

ప్రజాశక్తి-చింతపల్లి

మండల కేంద్రంలోని వివిధ రకాల వ్యాపారస్తులకు అనుకూలంగా ఉండేందుకు నాబార్డ్ ఆధ్వర్యంలో సుమారు 20 లక్షలు వెచ్చించి వారపు సంత షెడ్ల నిర్మాణం చేపట్టారు. వారపు సంత షెడ్లలో చింతపల్లి దుకాణ యజమానులతో పాటు నర్సీపట్నం, తుని, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు బుధవారం వారపు సంత నిర్వహించుకుని వ్యాపారస్తులు స్వగ్రామలకు వెళ్ళిపోతుంటారు. చింతపల్లి ప్రాంతానికి చెందిన కొంతమంది ఆకతాయిలు చింతపల్లి వారపు సంత షెడ్లలో మద్యం సేవించి, సీసాలు విడిచి పెడుతున్నారు. మద్యం సీసాలు పగలగొట్టి సంత షెడ్ల చుట్టుపక్కలు విచ్చలవిడిగా పడవేయడంతో ఆ ప్రాంతం చుట్టూ సీసా పెంకులతో దర్శనమిస్తున్నాయి. దీంతో దుకాణ యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారపు సంత షెడ్లలో తాగుబోతులు మద్యం సేవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు వ్యాపారస్తులు కోరుతున్నారు.

ఉన్న మద్యం సీసాలు

భవిత కేంద్రాల అభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీ ఏడు మండలాల్లో ఉన్న భవిత కేంద్రాలను అభివృద్ధి చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఏజెన్సీ డీఈవో, ఐసిడిఎస్ సిడిపిఓ, అన్ని మండలాల భవిత కేంద్రాల ఉపాధ్యాయులతో స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీతో కలిసి ఐటిడిఎ పిఒ సింహాచలం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, వివిధ పాఠశాలలలో మానసిక వికలాంగులను గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషణం లోపం, మస్తిష్క మెదడు పక్షవాతం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక వైకల్యం, బుద్ధి మాంద్యత, చలన వైకల్యం/శారీరక వైకల్యం, మరుగుజ్జుతనం, కుష్టు వ్యాధి నయాగ్రస్తులు, బహుళ వైకల్యం, అటిజం, దీర్ఘకాలిక నరాల సమస్య, కండరాలు క్షీణిత, బహుళనాడి వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, దళ సేమియా, రక్తం గడ్డ కట్టని స్థితి, కొడవలి కరణ రక్తహీనత, మెదడు నుండి నరాల బలహీనత వంటి 21 రకాల వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతి గ్రామంలో సర్వే చేసి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సర్వేలో అంగన్వాడీ కార్యకర్తల భాగస్వాములు కావాలన్నారు. భవిత కేంద్రాల్లో పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వికలాంగ బాల బాలికలకు వికలాంగ మెడికల్ సర్టిఫికెట్లు, పింఛన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ ఒక్కొక్క మానసిక బాల బాలికలకు ఐడి క్రియేట్ చేయాలని సూచించారు. మూగ పిల్లలకు సాధ్యమైనంతవరకు మాటలు వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలియో వ్యాధి రాకుండా గ్రామాల్లో పోలియో వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసక్తి ఉన్న వికలాంగులకు పెయింటింగ్, మెకానిజంపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సిడిపిఒ సంధ్యారాణి, యస్ఎ అర్చన రమణి, అన్ని మండలాల భవిత కేంకద్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

96 శాతం పశుగణన పూర్తి

ప్రజాశక్తి -కోటవురట్ల:కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో 96శాతం పశు గణన పూర్తి చేసినట్లు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహులు తెలిపారు. మంగళవారం ఆయన కోటవురట్ల పశువైద్యశాల వద్ద కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 14 నుంచి విజయనగరంలో నిర్వహించనున్న పాల పోటీలకు సంబంధించి తీసుకోవాల్సిన ఎంపిక చేయాల్సిన పాడిపశువుల గురించి అధికారులతో సమీక్షించారు. అదేవిధంగా ఈనెల చివరి వరకు జరగనున్న పశువు గణన శతశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాడి పశువులకు అందజేస్తున్న పశు బీమా పథకం అందరికీ వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్, డాక్టర్ పడాలి, హరిప్రియ, ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి పశువులతో అధికంగా పాల దిగుబడి

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుసంవర్ధకశాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.నరసింహులు మంగళవారం గొలుగొండ, నర్సీపట్నం పశు వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ అధిక పాలు దిగుబడినిచ్చే మేలు జాతి పశువుల పెంపకంపై ఆసక్తి పెంచాలన్నారు. శాస్త్రీయ పోషణ, యాజమాన్య పద్ధతుల ద్వారా పాల దిగుబడి పెంచవచ్చునని తెలిపారు. ఔత్సాహిక యువ రైతులకు ఆసక్తి పెంచాలన్నారు. ఉత్తరాంధ్ర స్థాయిలో ఈనెల 14, 15, 16 తేదీలలో పాడి పశువులకు మెగా పాల పోటీలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముర్రా జాతి గేదెలు స్వదేశీ ఆవులు, విదేశీ సంకరజాతి ఆవులకు వేరువేరుగా నిర్వహించే ఈ పోటీలలో మొదటి ప్రైజ్ సుమారు రూ.50వేలు, రెండో ప్రైజ్ రూ.40వేలు, మూడో బహుమతి రూ.25వేలుగా నిర్ణయించారన్నారు. రెండు రోజుల పాటు నిపుణులచే పశుపోషణలో మెలకువలు, ముఖాముఖి సదస్సు లు నిర్వహిస్తారన్నారు.ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవ కేంద్రం వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, నర్సీపట్నం, గొలుగొండ పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14న సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వేదికగా నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను నియోజకవర్గ జనసైనికులు జయప్రదం చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నం కృష్ణాపేలెస్‌లో ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం తర్వాత నిర్వహిస్తోన్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు అల్లాడ సురేశ్, నమ్మి రమణరాజు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి- నక్కపల్లి :రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. గొడిచెర్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలని వైసిపి, సిపిఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టని విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం వెంకటేష్ స్పందించారు. పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ హెూం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారులతో మాట్లాడడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నాయకులు వైబోయన రమణ, దార్ల కష్ణ పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణానికి మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ హెూం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పలువురు మంత్రులకు వెంకన్న ఆహ్వాన పత్రికను అందజేశారు. విజయవాడలో మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి తదితర మంత్రులకు హెూం మంత్రి అనిత సమక్షంలో స్వామివారి కళ్యాణ ఆహ్వాన పత్రికను నక్కపల్లి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక వెంకన్న ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, నాయకులు కొప్పిశెట్టి వాసు అందజేశారు. కళ్యాణ మహోత్సవానికి రావాలని మంత్రులను కోరారు.

హైవే రోడ్డు పనులతో..

దుమ్ము, ధూళి వ్యాపించకుండా చూడాలి

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

ప్రజాశక్తి- జిమాడుగుల లమ్మసింగి నుండీ వయా జి.మాడుగుల, పాడేరు వరకు హైవే రోడ్డు పనులతో పక్కన ఉన్న గ్రామాల్లో దుమ్ము ధూళి పొగతో కూడుకుపోతున్నాయని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు తెలిపారు. మంగళవారం మత్స్య పురం గ్రామ సమీపంలో నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశం వద్ద ఆందోళనకు దిగారు. ఒకవైపు అధికంగా దుమ్ము లేవడంతో రోడ్డు కనిపించక నిత్యం చాలా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులకు, కాంట్రాక్టర్లకు తెలియ చేసినా కనీసం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోకపోతే తక్షణమే స్థానిక ప్రజలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాడేరు: లమ్మసింగి నుండీ వయా జి.మాడుగుల పాడేరు మీదుగా ఎన్ హెచ్ 516 ఈ హైవే రోడ్డు పనులలో దుమ్ము ధూళి పొగతో నిండిపోయి రోడ్డు పక్కన గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీనిపై తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదివాసి రాష్ట్రీయ అధికార మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనరస మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు పనుల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో దుమ్ము ధూళి వ్యాపించి శ్వాస కోశ రోగులు, వృదులు,గర్భిణీలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. ఒకవైపు అధిక దుమ్ము లేవడంతో వాహనదారులు రోడ్డు కనిపించక నిత్యం చాలా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ రోడ్ మార్గంలో చింతపల్లి, జి.మాడుగుల మండలంలో ఉన్నత అధికార్లు నిత్యం ప్రయాణం సాగిస్తున్నారని, నివారించే చర్యలు తీసుకోలేదన్నారు. రోడ్డు కాంట్రాక్టర్ కూడా దీనిపై స్పందించి దుమ్ము, ధూళి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారాలకు కోరారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

6న చలో విజయవాడను జయప్రదం చేయాలి

సమావేశానికి హాజరైన ఆశావర్కర్లు

ప్రజాశక్తి -హుకుంపేట:కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశవర్క్, సీహెచ్‌డబ్ల్యూలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 6న గురువారం కలెక్టర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలనీ సీఐటీయూ మండల కార్యదర్శి తమార్బ అప్పల కొండ పడాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కనీస వేతనం రూ 26 వేలు, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సొంటేన హైమావతి, కొంతిలి వైస్ సర్పంచ్ కృష్ణమూర్తి, మోహన్, ఆశావర్కర్లు పెద్దమ్మి, ముత్యాలమ్మ, కొండమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

చింతపల్లి: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని అల్లూరి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సాగిన పద్మ, దాసమ్మ పిలుపునిచ్చారు. చాలీచాలని జీతాలతో ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రసూతి సెలవులు 180 రోజుల తోపాటు 62 ఏళ్ల పెంపు తప్ప జీతాలు పెంచిన దాఖలాలు లేవని వారన్నారు. చాలీచాలని జీతాలతో తమ కుటుంబాల పోషణ కష్టంగా మారిందని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

భక్తులకు అన్నసమారాధన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో మత్స్యరాస అవినాష్ వెంకటరాజు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పాత పాడేరుకు చెందిన కిల్లు గోవిందమ్మ ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, బిజెపి ఎస్ టి విభాగం అధ్యక్షులు లకే భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. భవిష్యత్తులో భక్తులకు మరిన్ని సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, కమిటీ సభ్యులు రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, దన్నేటి పలాసి రాము, కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్ కొమ్మోజి వెంకటరమణ, కిల్లు రాధాకృష్ణ నాయుడు, కారం దేముడు, కూర రాము, లకే రత్నాబాయి, పలాసి రమణమ్మ, సమాల గోపాల్, ఆలయ కమిటీ గుమస్తాలు గూడెపు సూర్యప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు

-నేటి రాత్రికి టిడిపి ఆఫీసులో బస

-6న గీతంలో కార్యక్రమానికి హాజరు

-కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రేపు రాక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 5వ తేదీ రాత్రి 11.45గంటలకు విశాఖకు విచ్చేస్తున్నారు. నేరుగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి రాత్రి విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. ఈ మేరకు ఖరారైన షెడ్యూల్ ప్రకారం 6వ తేదీ మధ్యాహ్నం రుషికొండ గీతం ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన విచ్చేస్తున్నారు. ముందు రోజు 5వ తేదీ రాత్రి నగరంలోని రామ్‌నగర్ (ఎన్‌టిఆర్ భవన్) టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. ఎపి బిజెపి అధ్యక్షులు దగ్గుబాటి పురంధరేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ఒక పుస్తకాన్ని 6న మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. 6వ తేదీ రాత్రి కూడా విశాఖలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి ఆఫీసులో బస చేయనున్నట్లు తెలుస్తోంది.

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలాసీతారామన్ ఈనెల 6న విశాఖలోని నోవటల్‌లో జరిగే పోస్ట్ బడ్జెట్ ఇంటరాక్షన్ సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేస్తున్నారు. నిర్మలా సీతారామన్ 6న ఉదయం విశాఖకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30గంటలకు నోవటల్‌లో జరిగే ఈ కార్యక్రమంలోనూ అనంతరం మధ్యాహ్నం 3.30గంటల నుంచి జరిగే మీడియా ఇంటరాక్షన్‌లోనూ కేంద్ర మంత్రి పాల్గొననున్నారు.

విశాఖ గీతంలో 5, 6 తేదీల్లో 10000 ఉద్యోగాలకు జాబ్ ఫెయిర్..

విశాఖపట్నంలోని గీతం యూనివర్శిటీలో నాస్కామ్ ప్రైమ్ కెరియర్ ఫెయిర్ 10వేల ప్లస్ జాబ్స్ యువత కోసం గీతం చైర్మన్, విశాఖపట్నం ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ నిర్వహిస్తున్నారు. 2024 - 2025లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న టెక్, నాన్ టెక్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లమో విద్యార్థుల కోసం 10 వేలకుపైగా ఉద్యోగాలను ఐటి, మాన్యుఫ్యాక్చరింగ్, ఫైనాన్స్, రిటైల్స్, లాజిస్టిక్స్, ఇతర రంగాల్లో నాస్కమ్, గీతం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఇక్కడ యువత జాబ్స్ కోసం ఏర్పాట్లను చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 6న రానుండడంతో ఆయన్ను ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లేకపోలేదు. కేంద్ర ఆర్థిక మంత్రి నోవటల్‌లోనూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గీతం సంస్థలో 6న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తుండడంతో టిడిపి, కూటమి నేతల్లో హడావుడి కనిపిస్తోంది.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలోని న్యాయ స్థానాలలో లక్షల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ డిమాండ్ చేశారు. ఆశీల్‌మెట్ట సమీపంలోని కెఎ.పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కోర్టు తీర్పుల విషయంలో సత్వర న్యాయం జరగడం లేదన్నారు. త్వరలో హ్యూమన్ రైట్స్, ఫండమెంటల్ రైట్స్, ఇండివిడ్యువల్ రైట్స్‌తో భారత న్యాయవ్యవస్థపై పోరాటం చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కూటమి ప్రభుత్వం ఓడిపోయిందని, డబ్బులు ఖర్చు పెట్టి కృష్ణ, గోదావరి జిల్లాలో కూటమి ఎమ్మెల్సీ సీటు గెలిచిందని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజల కోసం పోరాటం చేస్తూ అసెంబ్లీకి వెళ్లి ప్రశ్నించాలని కోరారు. ప్రశ్నించినందుకు నటుడు పోసాని కృష్ణమురళిపై 14 కేసులు పెట్టారని, మరి పవన్ కల్యాణ్‌ను తిట్టి రోడ్డుపై నడిపిస్తానని అన్న వారి మీద కేసులు పెట్టరా అని ప్రశ్నించారు. త్వరలో నాని, రోజాను, ఆ తర్వాత జగన్మోహన్‌రెడ్డిని అరెస్టు చేస్తారని చెప్పారు. ట్రంప్ భేటీతో మోడీ విశ్వగురు కాదని తేలిపోయిందన్నారు. ఈవీఎంలను తీసి బ్యాలెట్ పెట్టాలని కోరారు. 30 వేల మంది మహిళలు మిస్ అయ్యారని, నిరుద్యోగులకు ఉద్యోగాలని చెప్పి పవన్ ప్రజలను మోసం చేశారన్నారు. అదాని, అంబానీల కంపెనీలకు మాత్రమే మోడీ అనుమతి ఇస్తున్నారని, ఇతర కంపెనీలు రాకపోతే నిరుద్యోగ సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ప్రశ్నించారు. ప్రధాని మోడీ మతాల మధ్య యుద్ధం పెడుతున్నారని, మణిపూర్‌లోని మహిళలను వివస్త్రలను చేసి చంపుతున్నారన్నారని విచారం వ్యక్తం చేశారు. మోడీ, అమిత్ షా నుండి దేశాన్ని రక్షించడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసి ఎదుర్కోవాలని కోరుకుంటున్నానని తెలిపారు.

కవల పిల్లలకు ఎంబిబిఎస్ పట్టాలు

ఎంబిబిఎస్ పట్టాలందుకున్న కవలలు సౌజన్య, శరణ్య

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ పంచాయితీ ఎర్రంపాడు గ్రామానికి చెందిన కవలలైన అక్కా చెల్లెల్లు ఎంబిబిఎస్ పూర్తి పట్టాలు అందుకున్నారు. కాకినాడ జిల్లా రవాణా శాఖలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న ముర్ల రాము, సత్యవతి దంపతుల కవల పిల్లలు సౌజన్య, శరణ్యలు 2019లో నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరికీ ఒకటే ర్యాంకు వచ్చింది. దీంతో ఇద్దరు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో చేరి ఐదు సంవత్సరాలు ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఈనెల 2న రంగరాయ మెడికల్ కాలేజ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు చేతుల మీదుగా ఎంబిబిఎస్ పట్టాలను కవలలు ఇద్దరు సౌజన్య, శరణ్య అందుకున్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ

ర్యాలీ చేస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు సందర్భంగా జికె వీధి మండల కేంద్రంలో ఐసిడిఎస్ పిఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం మహిళలతో సమావేశం నిర్వహించి మహిళల హక్కులు, సమానత్వం, సాధికారి కపై అవగాహన కల్పించారు. పూజారిపాకల అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం, సిరు ధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలు వాటి ప్రాముఖ్యతపై క్లుప్తంగా వివరించారు. యోగా ఆసనాలు చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి అచ్యుతరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే రామలక్ష్మి, డి మోహిని, వలసమ్మ, కృష్ణకుమారి, అంగన్వాడీ సిబ్బంది, పిల్లలు, తల్లిదండ్రులు, కిశోర్ బాలికలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌లో ఎంఇఒల తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ దొర, సూరయ్యరెడ్డిలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి రికార్డుల్లో నమోదైన బియ్యం, కోడి గుడ్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందుతుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

7న కొయ్యూరు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 7న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్‌కెవి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33 పంచాయతీల సర్పంచులు, 15మంది ఎంపీటీసీలు, జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్‌తో పాటు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు.

జీడిమామిడి రైతులు మోసపోకుండా చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని జీడిపిక్కల రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐటిడిఏ సమావేశ హాలులో ఏడు మండలాలకు సంబంధించిన జీడిపిక్కల రైతులు, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ప్రతి నిధులు, ఎన్జీవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల రైతులకు అధిక వడ్డీతో వడ్డీ వ్యాపారస్తులు సంతకాలు పెట్టించుకుని డబ్బులు ఇచ్చి వేధించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. జీడిపిక్కల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంవత్సరం 100 మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనే లక్ష్యం పెట్టడం జరిగిందని తెలిపారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జీడి పిక్కల తూకంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజన రైతుల ఉత్పత్తులకు సంబంధించిన యాప్ ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు చేసిన జీడిపిక్కలు ఎక్కడికక్కడ ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. తమకు పురుగు మందులు, యంత్రాలు సరఫరా చేయాలని జీడి మామిడి రైతులు ప్రాజెక్ట్ అధికారిని కోరారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ, పిహెచ్‌ఓ కె.చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పి.శ్రీనివాస్, విడిఓలు యం.నాగేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, ఉద్యానవన శాఖ సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, అబ్బాయి రెడ్డి, శోభన్ బాబు, జీడి మామిడి రైతులు, జీడి పిక్కల ప్రాసెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై వికలాంగులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ సాయి చైతన్య

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో రేఖపల్లి గ్రామంలో ఏఎస్‌డిఎస్, శబరి వికలాంగుల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై వికలాంగులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ చల్లారి సాయి చైతన్య మాట్లాడుతూ వికలాంగులందరూ యుడి ఐడి కార్డు పొందాలన్నారు. సదరం సర్టిఫికెట్‌తో పాటు యూనిక్ డిజబుల్డ్ ఐడి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బ్యాటరీ సైకిల్, స్కూటీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాట్వాన్ సంఘం ఉపాధ్యక్షులు సోయం నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కో ఆర్డినేటర్ నేరుపటి రవి, ఏఎస్‌డీఎస్ సిబ్బంది ఉండవల్లి హరిబాబు, గొర్రె ముత్యాలరావు, రాజారావు, పూజిత, సౌజన్య, ప్రసాద్, మీనా, పులి శివశంకర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

రాజవొమ్మంగిలో పరీక్ష సామగ్రి అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ఎస్‌జె.రావు మెమోరియల్ సొసైటీ తరుపున బోర్నగూడెం ఆశ్రమ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్‌వి.కోటేశ్వరరావు మంగళవారం పెన్నులు, సర్టిఫికెట్లు పెట్టుకోవడానికి ఫోల్డర్లు పంపిణీ చేశారు. 250 మంది విద్యార్థులకు వీటిని అందించినట్లు కోటేశ్వరరావు చెప్పారు. విద్యార్థులకు పరీక్షలపై భయం, ఒత్తిడి లేకుండా మోటివేషనల్ క్లాస్ కూడా ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కొయ్యూరు: కొయ్యూరు మండలం, డౌనూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వైయస్సార్ టిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్, తెడాబరికి సురేష్ కుమార్ మంగళవారం ఎగ్జామ్ ప్లాంకులు అందజేశారు. పదో తరగతి విద్యార్థులు అందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వారా నూకరాజు, హెచ్ఎం ప్రభుదాస్, హెచ్‌డబ్ల్యుఒ హరిదేవ్, ఉపాధ్యాయులు గిరిబాబు పాల్గొన్నారు.

కొయ్యూరులో ప్లాంక్‌లు అందజేస్తున్న సురేష్‌కుమార్

సామూహిక వివాహాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు : దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సామూహిక వివాహాలకు అర్హులైన నిరుపేద యువతి యువకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ధార్మిక సంస్థల సేవా ప్రతినిధులు ప్రసాదు, కొర్ర బలరాం, ఆదివాసీ అర్చక సేవా సంఘం అధ్యక్షులు కంకిపాటి గిరిబాబు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ సామూహిక వివాహాలు చేసుకొనే వధూవరులకు నూతన వస్త్రాలు, మధుపర్కాలు, కాలి మట్టెలు, తలంబ్రాలు, పూలదండలు,. కర్పూర దండలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. వధూవరుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మూడు పాస్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ నెల ఈ వివాహాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు పూర్తి సమాచారానికి బలరాం 9441435750, కంకిపాటి గిరిబాబు 6303477680, జర్త రాజబాబు 8985224251 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్‌లను జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిఐ కార్యాలయంలోనూ, రెండు స్టేషన్‌లోనూ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రంపచోడవరం డిఎస్పి ప్రశాంత్ కుమార్, సిఐ ఎస్ సన్యాసినాయుడు, ఎస్‌ఐ చినబాబు, ఎస్బి హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిటీ లీగల్ అడ్వైజర్‌గా నూకరాజు

నియామకపత్రం అందుకుంటున్న నూకరాజు

ప్రజాశక్తి కొయ్యూరు : బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అల్లూరి సీతారామరాజు జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నడిగేట్ల నూకరాజును నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జిల్లాల వారీగా నూతన బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే అల్లూరి సీతారామరాజు జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటైంది. ఈ జిల్లా కమిటీలో కొయ్యూరు మండలానికి చెందిన నడిగేట్ల నూకరాజు జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నియమితులైనట్లు తెలిపారు. బాలల సమస్యలు, వారి హక్కులు, జీవన విధానం, ఆరోగ్యం వంటి వాటిపై పని చేయడానికి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీకి నూగరాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ లైన్‌మెన్లకు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి- సీతమ్మధార : అత్యుత్తమ పనితీరు కనబరిచి, అల్లూరి జిల్లా చింతూరు లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు సాధించారని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. మంగళవారం ఢిల్లీలో లైన్‌మెన్ దివస్‌లో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘనశ్యామ్ నుంచి గణేష్ అవార్డు స్వీకరించారన్నారు. అలాగే ఉత్తమ లైన్‌మెన్లగా ప్రశంసలు పొందిన అనకాపల్లి సర్కిల్‌కు చెందిన బి.మాణిక్యాలరావు, పార్వతీపురం సర్కిల్‌కు చెందిన పి.సింహాచలానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమ, గృహ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్న లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల సేవలను గుర్తించి, కేంద్ర విద్యుత్‌మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఏటా మార్చి 4న 'థాంక్ ఎ లైన్‌మెన్' పేరిట లైన్‌మెన్ దివస్‌ను నిర్వహిస్తోందన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో లైన్‌మెన్ దివస్‌ను నిర్వహించా మన్నారు ఉత్తమ లైన్‌మెన్లకు సిఎండి పృథ్వీతేజ్‌తోపాటు సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.